ఓ ఎ రోమన్

నెల్లుట్ల నరసింహారావు

ఇది విన్నావా?' అంటూ ప్రవేశించాడు శ్రీపతి నా ఇంట్లోకి - పొద్దున్నే తన ముఖంలోని ఆరాటాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నంచేస్తూ.

ఆరోజు శెలవు కావడం మూలాన తాపీగా సిగరెట్టుముట్టించి నేను దినపత్రిక తిరగేస్తూ తలెత్తి అన్నాను 'ఏదీ ఇంకా నువ్ చెప్పందే___' కుర్చీ గుంజుకుని దగ్గిరగా కూర్చుంటూ - 'రంగనాధంగారి రెండో అమ్మాయి రహమాన్‌తో లేచి పోయిందట' అన్నాడు శ్రీపతి.

'రంగనాథం గారి అమ్మాయా? యే రంగనాథం? శ్రీపతి చెప్పబోయేది అబద్ధం' అయి వుంటే బావుండనే ఆశతో అన్నాను-కొంత అనుమానంతోనే.

'అదే-డాక్టర్ రంగనాధం-నీ సాహితీ మిత్రుడు'.

'ఏంటేంటి కాస్త సవిస్తరంగా ఏడువ్వా' చనువుతో. దుర్వార్తవిన్న అసహనంతో ఆతురత కనబర్చా నేను.

'డా॥రంగనాధం రెండోకూతురు వనజ గురువుగారయిన కాలేజీ లెక్చరర్ రహమాన్‌తో నిన్నరాత్రి చెప్పాపెట్టకుండా లేచిపోయింది.'

'నమ్మకమేవిటీ - ఇంకెవ్వైనా వేరేపని మీదెళ్లుండొచ్చుగా' అన్నాను.

'ఆధారంలేందే ఈశ్రీపతేవీ చెప్పడని మరోసారి గుర్తుచేస్తున్నాను-వనజ పోతూ పోతూ తండ్రికో వుత్తరం రాసిపెట్టి మరీ వెళ్ళింది - అయినా వాళ్ళది మాయింటి పక్కిల్లేగా?' తనమాట నిరూపించుకునే ఉద్దేశం శ్రీపతిది.

* * *

అదొ చిన్నటౌను - అనాటికి అంటే షాతికేళ్ళకి పూర్వం అన్నమాట-ఇప్పుడు కాసింత పెద్ద టౌనే అయిందిలెండి-మా వూరునుంచి బయలుదేరి బస్సులో వస్తూ పోతూ సెంటర్లో రోడ్డుప్రక్క సైన్ బోర్డు చదువుతుండేవాడిని,' డాక్టర్ రంగనాధం. M B B S ' అని ఉండబట్ట లేక ఓరోజు మానాన్న నడిగాను M B B S అంటే ఏవిటని-'అదోపేద్ద వైద్యం చదువులే' అన్నాడు నాన్న అప్పట్నించీ ఆమాటే నాలో బాగా నాటుకుపోయింది— పేద్ద వైద్యం చదువుఅని అవుతే నేను చదువుకునే రోజుల్లో డిగ్రీలూ వాటి విలువలూ తెల్సుకునేపాటి పరిజ్ఞానం వచ్చేనాటికి అ M B B S ఎంతపెద్ద చదువో తెల్సొచ్చింది ఎప్పుడు బస్సులో ప్రయాణం చేయాల్సొచ్చినా అటౌను మీదుగానే గనుక 'రంగనాధం M B B S ' అనే మాటలు నాలో బాగా ముద్రవేసుకున్నాయ్ అడపా దడపా అ క్లినిక్ లో మెళ్ళో స్టెతస్కోపుతో అ రంగనాధం అనబడేవ్యక్తి కనుపించేవాడు గూడా

నేనెవరో రంగనాధానికి తెలియకున్నా రంగనాధానికి మాత్రం నేనేకలవ్య శిష్యుణ్నయిపోయి - ఏనాటికయినా అ చదువు చదివి అంతటివాడ్నికావాలనుకునే వాడ్ని వయసుతోపాటే అ కోరికా పెరుగుతూ వచ్చింది

కోరింది కోరినట్లుగా జరిగేట్టయితే సమాజం ఈ రూపంలో ఎందుకుంటుంది? భగవంతుడనేవాడు మాటిమాటికీ ఎందుకు జ్ఞాపకం వస్తాడు?

ఎలాగయితేనేం చచ్చీచెడి డిగ్రీ చేత బుచ్చుకుని టీచర్ ట్రైనింగ్ అయ్యేసరికి నాకు తాతలు దిగొచ్చారు-యాదృచ్ఛికంగా అదే టౌన్ లో పోస్టింగ్ ఇచ్చారు గౌరవనీయ గవర్నమెంటువారు

మధ్యతరగతి కుటుంబాల్లో ఒకవ్యక్తి ఉద్యోగంలో ప్రవేశించాడూ అంటే జీవితం రొంపిలో కాలుబెట్టాడనే అర్థం-అందులో కాలుబెట్టాడూఅంటే ఆశయాల సమాధికి పునాదులు వేస్తున్నాడనే అర్థం, సంఘంలో సామాన్యుడుగా నేను ఈ ఫార్మాలిటీస్ కి అతీతుడ్ని కాలేకపోయాను

ప్రతి మనిషీ ఏదోఒక రకంగా బ్రతుకుతూనే వుంటాడు ఆజీవన విధానములో తనకున్న పరిధిలోనే బ్రతుక్కి ఓ పరమార్థం నిశ్చయించుకుంటాడు—అసంతృప్తి పడ్డవాడూ ఆశల్ని పెంచుకున్నవాడూ శక్తియుక్తులున్నవాడూ మాత్రం ఒకేరకంగా సాగిపోకుండా ఎప్పటికప్పుడు మారుతూ-ఆత్మవిశ్వాసంతో తన పరిస్థితులను మార్చుకుంటూ ముందుకు సాగిపోతాడు—అక్కరకొస్తే ప్రగతీ— లేకుంటే దానిపేరే అధోగతి

నేనూ నా అభిరుచులకీ స్థాయికీ తగినట్టుగా అటౌన్ లో ఓ సర్కిల్ ఏర్పరచుకున్నాను-అందులో ఎక్కువమందీ సమకాలీన సాహిత్యంతో సంపర్కమూ అభిరుచీ వున్నవారే-అలాంటి రెక్కలే గలిగిన పక్షుల్లో రంగనాధంగారు ఒకరు

* * *

అంతవరకూ వృత్తిరీత్యా ఎన్నడూ ఏర్పడని అవసరం డా రంగనాధం గారితో ఆరోజేర్పడింది-ఒళ్ళు కొంచెం సుస్తీగా వుండటం మూలాన

'రండి మేష్టారూ - రండి' అంటూ సాదరంగా ఆహ్వానించారు

నమస్కరించి ఎదురుగావున్న కుర్చీలో కూర్చుని క్లినికంతా కలియజూశాను— కంపౌండర్ కుర్రవాడు తప్ప యెవరూ లేరు

'ఊఁ చెప్పండి' అన్నాడు డాక్టరు గారు గొంతు సవరించుకుంటూ

'తలనొప్పి - కొంచెం టెంపరేచర్ గూడా వస్తోంది ' నా రోగలక్షణాలన్నీ ఏకరువు బెట్టబోయాను

'అదిగాదండి బాబూ-మీ రచనా వ్యాసంగం ఎంతవరకొచ్చిందీ — ఈమధ్య నేమేం రాశారూ-అదిజెప్పండి-' అన్నారు రంగనాధంగారు మధ్యలోనే కల్పించుకుని చేతిలోవున్న మాపె నవల ది రేజర్స్ ఎడ్జ్ రాక్‌లో సర్దుతూ

ఈయనతో ఇదేచిక్కు - పేషెంట్ల గురించి ఎక్కువగాపట్టించుకోడు సరిగదా! ఎవడయినా ఎరిగున్న తెల్లబట్టలవాడయితే సాహిత్య రోగం అంటించి మరీ వదులుతాడు

'అబ్బే ఈమధ్యనేం రాయలేదండీ' అన్నాను ఇబ్బందిగా మొఖంపెట్టి

'సామ్యూల్ రెండు స్ట్రాంగ్ టీ పట్టించుకురా' అని కంపౌండరుకు పురమాయించి నావేపు దిరిగి—మందులూ— మందులూ-అంటారుగానీ మేష్టారూ చాయ్ మాత్రం సర్వరోగ నివారిణి అంటాన్నేను-రంగనాధంగారు ధోరణిమారుస్తూ అన్నారు

చాయ్ తాగింతరువాత చర్చ కోకొల్లలుగా వస్తున్న స్త్రీల రచనల గురిచీ— ఆధునిక సాహిత్యం తీరుతెన్నుల గురించి వద్దెర చండీదాసు 'హిమజ్వాల' గురించీ ఒక్కమాటలో చెప్పాలంటే 'నా ఆరోగ్యం గురించి తప్ప' చాలా చాలా విషయాలమీద రెండు గంటలసేపూ నిర్విరామ చర్చసాగింది

చివరికి మీకేం జబ్బులేదూ—వక్కపూట వుపవాసం చేస్తే చాలనే సలహా ఇచ్చి పంపించారు రంగనాథంగారు నన్ను

* * *

క్లినిక్‌నుంచి బయటికొచ్చినా నా ఆలోచనలన్నీ రంగనాధంగారిచుట్టే తిరుగుతున్నాయ్ పాతికేళ్ళబట్టేను-అంటే నాబుద్ధి తెలిసినప్పట్నించీ చూస్తూన్నా-అదే అద్దె క్లినికూ—అదే వ్యవహారం—అదే అవతారం తనుంటున్న ఇల్లుగూడా అద్దె కొంపే అని తరువాత తెల్సింది

మొదట్లో ఏం సంపాదించాడో ఏమో గాని - ఈ అయిదారేళ్ళబట్టీ చూస్తున్నా ఎదుగూ బొదుగూలేని ప్రాక్టీసుతో-బొటాబొటీగా తిండికి సరిపోయేదే మహాకష్టం అనిపిస్తుంది-పైగా గంపెడు సంసారం అందులో నిప్పులు గడుక్కునే బాపత్తు ఛాందశోత్రీయ కుటుంబం

పాతికేళ్ళ క్రిందటే అంత చదువు చదివినవాడు ఈ కాలం రేట్లప్రకారమైనా కనీసం పదిలక్షలు సంపాదించాల్సిందె- అది వేలల్లోనైనా వుంటుందనుకునే పాటు ధైర్యంకూడా నాకులేదు

అసలు రంగనాధంగారు వైద్య వృత్తినే ఎందుకు ఎన్నుకున్నారో అర్థం కాదు ఒక రకంగా ఆలోచిస్తే వైద్య

వ్యతిరేక ప్రచారం చేస్తున్నట్టనిపిస్తా రాయన

నీకేం రోగంలేదు—

ఉపవాసముంటే తగ్గుతుంది—

శొంటి మిరియాల చారువాడు పోతుంది—

పెన్సిలిన్ పదేపదే వాడటం హానికరం—

ఆస్ప్రిరిన్ వాడితే గుండె జబ్బులొస్తాయి—

శరీరాన్ని మందులకు అలవాటు చేయవద్దు—

తప్పని సరయితే తప్ప యింజెక్షన్ వాడొద్దు-లాంటి ఉచిత సలహాలిస్తాడు నాడిబట్టుకు చూసే వృత్తైనా-ప్రజలనాడికి అనుగుణంగా పైసలు సంపాదించేమార్గం వెతకడు-ఎప్పుడూ ఏదో ఓ పుస్తకం చదువుతూంటాడు-అందులో తనకు నచ్చినదేదయినావుంటే నాలాంటివాడికి చెప్తేగాని తృప్తిపడడు

డాక్టరుగారు జ్ఞాపకమొచ్చినప్పుడల్లా నన్నో విషయం వేధిస్తుంది ఎటుదిరిగీ అవసరాల్ని కనుక్కోడానికి, ఆశయాల్ని అమలుపర్చుకోవడానికీ నాబోటి తాలు నౌకరీగాళ్ళకి అవకాశం లేదాయె—మరి అన్నీవుండి ఆర్థిక ఇబ్బందులు బడుతూ వయస్సు మీరిపోతున్నా ఈనకి డబ్బు కాంక్ష లేదేమిటి? అని

ఏదో ఒకసమయంలో లక్ష్మీదేవి ప్రతివాడింటి తలుపూ తడుతుందట - ఆ సమయానికి తలుపు తెరచి ఆహ్వానించితే తరింపజేస్తుంది-ఇంట్లో లేకనో తలుపు తెరవకనోపోతే ఆఇల్లు దాటవేసిపోతుంది మరి అల్లాంటి మహదవకాశం ప్రతివాడి జీవితంలో ఏదో ఓ లిప్తమాత్రంలోనే ఉంటుంది అదృష్టానికీ దురదృష్టానికి అడుగుదూరమే తేడా అని ఎక్కడో చదివాను అది గుర్తుకొస్తుందీ డాక్టరుగారి విషయంలో

దీన్ని గురించే ఆలోచించుకుంటూ నడుస్తున్న నన్ను రోడ్డుమలుపులో ఎదురుగా విశాలమైన కాంపౌండులో వున్న పచ్చమేడ ఆకర్షించింది-ఇదివర్లో ఎన్నో మార్లు దాన్నిచూస్తూనే వుండినప్పటికీ ఈ రోజు ఎందుకో కొత్తగా అనిపించింది రంగనాథంగారి గురించే ఆలోచిస్తూ వైద్యవృత్తి-డబ్బు సంపాదన-చిట్కాలు అదృష్టం మొదలైనవాటిమీద డాక్టరేటుకు సరిపోయేంత శోధనలోవున్న నేను ఆ మేడ నిర్వాశో కొత్త కోణంలోంచి నూతన దృక్పథంతో చూడగలిగానేమో! కొట్టవచ్చినట్టుగా గేటుకు ఓ నల్లబల్లంత బోర్డు వ్రేలాడగట్టబడివుంది 'డా వెంకటయ్య, ఆర్.ఎం పి, వైద్యవిద్వాన్ భిషగ్వర చింతామణి', ఇచ్చట సమస్తవ్యాధులకూ గ్యారంటీగా చికిత్స చేయిబడును' అనే అక్షరాలతో మెరసిపోతూ

నాకేదో జబ్బుందనే అనుమానంతో రంగనాధంగార్ని చూడబోతే 'జబ్బేంలేదు' పొమ్మన్నాడుగాని నాఅనుమానం నివృత్తిగాలేదు-ఏదో వుండవచ్చుననే భయం పీడిస్తూనే వుంది-ఎందుకయినా మంచిదని వెంకటయ్యగారిఆస్పత్రిలో ప్రవేశించాను. ముందుహాలే గాకుండా వరండాగూడా జనంతో కిక్కిరిసివుంది. రెండుగంటలు తరువాతగాని డాక్టరుగారి దగ్గరకెళ్ళేవంతు రాలేదు

జ్యోతి కథకార్టూన్ బీ ఎ రోమన్.



నమస్కరిస్తూ డాక్టరుగార్కి నన్ను నేను పరిచయం చేసుకున్నాను నోట్లు లెక్కబెట్టుకుంటూ వంచిన తలెత్తకుండానే 'ఉఁ ' అని తనపనిలో నిమగ్న మయ్యారు సదరు వెంకటయ్యగారు

పెద్దటేబులూ దానిమీద మడతవిప్పని ఓ నాల్గయిదు ఇంగ్లీషు, తెలుగూ ఉర్దూ దినపత్రికలూ, ట్రేలో స్టెతస్కోపూ, బి పి ఆపరేటసూ వున్నాయి సీలింగ్ ఫ్యాన్ నిర్విరామంగా తిరుగుతుంది, ఓ అయిదు నిమిషాల తరువాత నామీద అనుగ్రహం కలిగింది గాబోలు—

'ఏంటయ్యా పంతులూ ఏం సంగతి' అన్నారు డాక్టరుగారు నన్నుద్దేశించి రివాల్వింగ్ ఛేర్‌లో పైమూలగా తిరిగి విలాసంగా.

నా అనారోగ్య లక్షణాలు ఏకరువు బెట్టాను నన్ను తన దగ్గరగా రమ్మని ఛాతీ, పొట్టా వీపూ కంటిరెప్పలూ, నాలుకా నాడీ అన్నీ చూశాడు తిరిగి నన్ను కూచోమని సావకాశంగా ప్రశ్నించసాగాడు

'సిగరెట్లు కాలుస్తావా?'

'ఆఁ కాలుస్తాను'

'సరే! ఆకలి ఎలావుంటుందీ?'

'పెద్దగా ఆకలనిపించదు-ఏదో వేళకు యాంత్రికంగా తినడవే తప్ప '

'మూత్రమెలా వస్తుందీ?'

'ఉదయమూ, సాయంత్రమూ కాస్త పచ్చగనే వుంటుంది'

'తలనొప్పిగా గానీ, భారంగా గానీ వుంటుంది గదూ!'

'ఆఁ అవునండీ వుంటుంది-పైగా దినంలో ఎక్కువ కాలమూ నీరసంగా వుంటుంది'

'ఆఁ ఆఁ నేనను కుంటూనే

వున్నాను' రోగనిర్ధారణ జరిగిపోయిందట్టుగా.

'ఏం జబ్బుయ్యుంటుందండీ' ఆతృత నణచుకోలేక ప్రాణంమీది తీపితో అడిగాను.

'చూడు పంతులూ-నీ వయస్సెంతుందేవిటీ' అన్నాడు చుట్టముట్టిస్తూ ధోరణి మార్చి-

'ముప్ఫయ్యొక్క-టెళ్ళాయండీ'

'సరిగ్గా వైద్యవృత్తిలో నా సర్వీసూ అంతే'-పొగవదల సాగాడు (యిలాగే యింకెందరితో అన్నాడోమరి) చూడూ! విద్యార్థికి గురువుమీద గురివుంటే పారం ఎలా బోధపడుతుందో-రోగికి కూడా వైద్యుడిమీద అలాగవుంటేనే రోగం బాగవుతుంది - ఇది నా అనుభవంమీద మాటనుకో'బహుగంభీరంగా ధ్వనించింది కంఠం___వెంకటయ్యగారిది.

"మరేనండీ నిజవేఁ" నాన్చుతూ___ నాలో నేననుకున్నాను ఇదేదో దీర్ఘోపన్యాసానికి ఉపోద్ఘాతమని.

"అయితే చూడూ! నామీద నమ్మకముంటే-నాదగ్గిరే వైద్యం చేయించుకునే వాడివైతే నేన్నీ రోగం ఏమిటో చెబుతాను-ఏవంటావ్?''

"సరేనండీ" ఉచ్చులో చిక్కి-పోతున్నానురా భగవంతుడా అనుకుంటూ__ మొహమాటం తెచ్చిపెట్టిన ఇబ్బందితో.

"ఏదీ ఓ అయిదు-రూపాయల ఫీజు ఇలా ఇవ్వు" నిర్మొహమాటంగా అన్నాడు.

అవును మరి ఆహారం దగ్గిరా వ్యవహారం దగ్గిరా మొహమాటం పనికి రాదనేగా పెద్దలనేది.

జేబులో వున్న ఒక్క-గానొక్క- పది నోటిస్తూంటే-పులినోట్లో తలదూరుస్తున్నాననే భావన లీలగా నాలో చోటు జేసుకుంది.

మిగతా అయిదు రూపాయలు తిరిగి నాకిస్తూ-"చూడు పంతులూ ఆర్థికఇబ్బందులందరికీ వుంటాయ్___నేన్చెప్పేది బాగా విను-ఓ వారం రోజుల్లో జబ్బు నయం చేస్తాను, మందులూ అవీ మాత్రం తెచ్చుకో-ఇక నాఫీజు విషయం అంటావా! నీజీతం అందుకున్నాకే ఇద్దువులే__నేనేం మిగతా వాళ్ళలాగా డబ్బుకు కక్కుర్తి పడే రకంగాదు-అయినా ప్రాణం ముఖ్యం గాని పైస శాశ్వతమా పంతులూ! అశ్రద్ధ చేయకేం ఇప్పుడిప్పుడే క్షయ వ్యాధి లక్షణాలు ప్రారంభమయ్యాయ్ - ప్రాణాలతో పని సుమా! వెనక ముందాడి పిల్లలకు అన్యాయం జేయకు" అంటూ ఓ గజంన్నర ప్రిస్క్రిప్షనిచ్చాడు-మందులు కొనుక్కొచ్చుకుంటే వాడే విధానం చెబుతాననే షరతు విధిస్తూ.

నమస్కరించి ఈవలికొస్తూ అనుకున్నాను "వైద్యో నారాయణో హరీ" గదా అని ఓ పదిహేను రోజుల తరువాత డెబ్బైఅయిదు రూపాయల ఖరీదుతో నా సోక్కాల్డు జబ్బు కుదిరింది-అలాగే నాతిక్క-గూడాను.

చాలా రోజులుగా రంగనాథంగార్ని కలవక పోవడంతో కాళ్ళు అటే లాక్కె-డితే తీరుబాటుగా క్లినిక్‌లో కూర్చుని డాక్టరుగారితో బాతాఖానీ వేస్తున్నాను. (నా అనారోగ్యం వెంకటయ్యగారి ట్రీట్

మెంటుల ప్రస్తావన రాకుండా జాగ్రత్త పడతూ)

ఇంతలో ఓ పల్లెటూరి నడి వయస్కుడు ప్రవేశించాడు. గొంగళీ. నెత్తికి రుమాలూ, రెండు బారల చేతికర్ర ధరించి, నోట్లోని చుట్టను గుమ్మంలోనే గిరవాటేసి తుపుక్కున వుమ్మేసుకుంటూ

అతనివేపు సాభిప్రాయంగా చూశారు రంగనాధంగారు సంగతేమిటన్నట్లు "దాని మొదలార పదొద్దుల్నించి పానం నవులేత్తాంద్రుండి—ఒల్లంత ఒకటే తీపులు. సలసల కూకోనీయదు. నిలబడనీయదు—ఒక్క గాబైన ఇంజిసనియ్యరి—దెబ్బకే పోవాల్నరి రొగం దీనియవ్వ—" ఏక బిగిని దంచేశాడు రంగనాధంగారి మనస్తత్వానికి సెల్ఫ్ ప్రిస్కిప్షన్ నిచ్చుకునే పేషంట్లంటే మహా చిరాకు—

"ఎన్కటికోపాలి గిట్లనే ఒత్తే మావూరి వొయిద్దుడు "అది" త్తైనే కత్వయించ్రి మల్ల గదే ఇత్తిరా ఇక పోకేం శేసుద్ది" అతని ధోరణి సాగిపోతూనే వుంది

"ఏదీ ఇలా దగ్గరికిరా! నన్ను పరీక్షించనీ అసలు జబ్బేంటో" అసహనంగా అన్నారు రంగనాధంగారు

"జబ్బు దేవుండుండి—నేజెప్పిన గాబైన సూదియ్యరి ఎంతకర్సయినా బెట్టుకుండగాని "

"ఘాటైన సూదీ ఘాటైన సూదీ అని నీ ముచ్చట నువ్వే అయితే నాదగ్గిరికెందుకూ రావడం-అదేదో నువ్వే కొని గ్చ్చుకుంటే ఏ తలమాసిన వాడైనా సూదిస్తాడు" అతన్ని పరీక్షచేస్తూనే విసుగుదల ప్రదర్శించారు డాక్టరుగారు

ఎందుకో వుండబట్టలేక నేను కల్పించుకుని "డాక్టరుగారూ బహుశ! ఇంట్రా వీనస్ కాల్షియం ఇంజక్షనయ్యుండొచ్చు" అన్నాను

"దీనికి ఇంట్రా వీనసెందుకండి బాబూ. ఇదేదో "ఫ్లూ" లాగుంది" అంటూ నావంక చూశారు రంగనాధంగారు

"ఆఁ గదే ఆ బాబు చెప్పిందే రైటు-అసుంటి సూది త్తైఇయ్యి లేకుంటె లేదెహె" దురుసుగా అన్నాడు ఆ ఆసామి

"చూడు నాయనా నువ్వు చెప్పిన మందే నేనివ్వను—ఒకవేళ గనుక నీకు అదే కావాలనుకుంటే ఇచ్చేవాళ్ళివూళ్ళో చాలామందున్నారు—వెళ్ళు" తాపీగా వదిలించుకునే ధోరణిలో సలహా ఇచ్చారు

విసురుగా ఆ ఆసామీ వెళ్ళిపోనే పోయాడు—

నిర్లిప్తంగా నవ్వారు డాక్టరుగారు—"చూడండి మాస్టారూ అతను చెప్పిన ఇంజక్షనే ఇచ్చి ఏవో నాలుగు గోలీలూ ఓ టానికూ రాసి పదోపాతికో లాగితే సంతోషంగా ఇచ్చిపోతారు—ఆ సంగతి నేనూ గ్రహించగలను-కాని పేషంటును అమాయకుడిని చేసో లేకపోతే ఏదో పేద్ద జబ్బుందని అదరగొట్టో డబ్బుల్లాగడం కన్న ఆత్మహత్య మేలంటాను-ఇందులో ఏం న్యాయముంటుంది చెప్పండి? డాక్టరూ మందుల కొట్టువాడూ బతికి పేషంటును దెబ్బ తినిపించడం తప్ప!

ఈ మాటలు నాకుగూడా తగిలాయ్! "అది తప్పే కాదన్ను కానీ మీ దగ్గరి

కొచ్చినవాడిన తిప్పికొట్టకుండా న్యాయం గానే నచ్చజెప్పి మీరూ స్థాయికి తగి నట్టుగా ఎంతోకొంత ఫీజు ఛార్జ్ చేయొచ్చుగా" డాక్టరుగారికీ నాకూ వున్న చను వుతో సూచించాను

"అవునండీ-ఒకళ్ళేమో ఏమీలేకున్నా ఏదోవుందనే మానసిక బలహీనతతో వస్తారు. కొందరేమో మిడిమిడి జ్ఞానంతో తమకే మందుకావాల్నో తామే నిర్ణయించుకుని వస్తారు సూదిస్తే తప్ప రోగం తగ్గదనే సూపర్‌స్టిషన్ గలవాళ్లు కొందరు-ఇలాంటి వాళ్ళదగ్గర డబ్బుల్లాగి—మానవత్వంమీదా, భగవంతుడిమీదా విశ్వాసమున్న వాడెవ్వడూ ఆత్మవంచన చేసుకుని డబ్బుల్లాగొద్దనేది నా ఫిలాసఫీ"

"మీ ఫిలాసఫీ మెచ్చదగిందే కాని మారుతున్న కాలంతోపాటు పెరుగుతున్న జీవన ప్రమాణంతోబాటు — పొజిషన్ మెయింటెయిన్ చెయ్యాలన్నా-కోరికలు తీర్చుకోవాలన్నా కావాల్సిందొక్క- డబ్బే నన్న నగ్నసత్యం మీకు తెలియంది కాదు గదా!"

"పొజిషనూ, కోరికలూ అనే మాటలకో పరిమితి లేదుగదా మాస్టారూ! పెంచినకొద్దీ పెరుగుతాయి, తగ్గిస్తే తల వంచుకుంటాయి-హ్యూమన్ వ్యాల్యూస్ (Human values) తెలియని ఈ సమాజంలో మీరు చెప్పేలాంటి జీవితమే గనక మానవుడికి పరమార్ధమయితే— అలాంటిది నాకొద్దు" హర్ట్ అయినట్టున్నారు రంగనాధంగారు

"గొంగట్లో తినుకుంటూ అనే సామెత ఇక్కడ గుర్తుచేయాల్సొస్తుందేమో" అన్నాన్నేను—ఎంతసేపు వాదించినా డాక్టరుగారు నా దారిలోకి వచ్చే అవకాశం కనిపించకపోయినా — చివరి ప్రయత్నంగా

"చూడండి డాక్టరుగారూ మీమట్టుక్కు మీరైతే కోరికలను చంపుకోవచ్చు మానవత్వం పేరిట మమకారాల్ని పెంచుకుని ఆడంబరాల్ని తగ్గించుకోవచ్చు కాని ఉదాహరణకు మీ కుటుంబాన్నే తీసుకుందాం-ఈ తరంలో పుట్టి ఇరవయ్యో శతాబ్దపు స్వేచ్ఛావాయువుల్ని పీలుస్తున్న మీపిల్లల దృక్పధాన్ని శాసించగలరా? మారుతున్న యువతరంతోపాటు వాళ్ళూ మారకుండా మడిగట్టుక్కూర్చోమంటారా?"

"అనను-శాసించను గూడా-నా అభిప్రాయాలతో ఎడ్యుకేట్ మాత్రమే చేయడానికి ప్రయత్నించగలను-ఆపైన ఎవరి మార్గం వారిది—రెక్కలొచ్చిన పక్షుల్ని ఎత్తుకు తిరగాల్సిన అవసరం లేదుగదా" నిర్లిప్తంగా అన్నారు డాక్టర్

ఈ చర్చ ఇప్పట్లో తేలేది కాదనుకుని సెలవుతీసుకుని బయటపడ్డాను యధాలాపంగా బాటవెంట నడుస్తూవుంటే డా వెంకటయ్యగారి బంగళావేపు దృష్టి పోయింది-అదేవ్యక్తి అంటే రంగనాధం గారితో గాబైన సూదివ్వమన్న వ్యక్తి చేతిలో ఓ కాగితంతో గేటు తోసుకుని బయటికొస్తున్నాడు

ఆంగ్జయిటీ నాపుకోలేక చప్పట్లు చరచి పిలిచాను—

"ఈ డాక్టరుబాబు దేవుడుండీ అడిగిన సూది యెంటనే ఇచ్చిండు—ఇప్పుడు కాస పానం కుదురుతుంది—ఇంకిన్ని

జ్యోతి కథకార్టూన్ బీ ఎ రోమన్



మందులు గూడ రాపి ఇంటికాడ ఏస్కో మన్నాడు పదిరూపాయలుపోతె మానెగాని రెండు నివుసాల్ల పనైంది ఇంక మా వూరు బోత" అని చెప్పాడు ముఖంలో తృప్తి వెలిగిపోతుండగా

వృత్తిరీత్యా ఒకటే అయినప్పటికీ ప్రవృత్తుల్లో తేడాలున్న రంగనాధంగారినీ వెంకటయ్యగారినీ బేరీజు వేసుకుంటూ— ద్వంద్వంలో కొట్టు మిట్టాడుతూ—ఏది మంచీ-ఏది చెడూ-ఏది సత్యం-ఏది నిత్యం అనేది తేలక ఆలోచిస్తూనే ఇంటికి చేరుకున్నాను.

కాలచక్రం ఎవరికోసం ఎప్పుడూ ఆగదు-ఇప్పుడు గూడా ఆగలేదు ఎప్పటి లాగే ఆరాత్రి గూడా తెల్లవారింది కాని వనజ లేచిపోయిందని శ్రీపతి మోసు కొచ్చిన వార్తవిని నేను మాత్రం స్థంభించి పోయాను

ఎదిగిన పిల్లల పెళ్ళిళ్ళు చేయలేకా—

నిరుద్యోగులైన కొడుకులకు ఏదో ఓ దారి చూపించనూ లేక—

ఆదర్శాలను బట్టుకుని ప్రేళ్లాడిన రంగనాధంగారికి ఇది నిజంగా పరాజయ మనే నా భావం

మరయితే మానవుడికి మంచితనమూ-ఆశయాలూ వుండడమే తప్పా?

కాకుంటే సమాజం ఎటువైపు పయనిస్తున్నట్టు?

ఏదీ తేల్చుకోలేని ద్వైదీ భావంతో కొట్టు మిట్టాడ సాగింది మనస్సు

నాముందు నిలిచింది ఒకే ఒక ప్రశ్న "టుబీ ఆర్ నాట్ టుబీ"—

* * *

రోజులు సర్వసాధారణంగా గడిచి

పోతున్నాయ్-సామాన్యుడికి అంతకంటే ఇంకెలా గడుస్తాయి—అల్లా గడవడం గూడా ఓ గొప్ప విషయమే మరి!

ఆ సంఘటన జరిగిన తరువాత ఇక రంగనాథంగారి దగ్గరకు పోబుద్ధిగాలేదు

అయితే అందులో వేరే దురభిప్రాయం మాత్రం ఏంలేదు బాధలను చూడగానే అనుభవించగలను గాని ముఖాముఖి పంచుకునే ధైర్యం నాకు లేకపోవడమే తప్ప-రంగనాథంగారి గురించీ, ఆయన కూతురు చేసినపని గురించీ ఏదో విపరీతంగా అసహజమైనదిగా భావించలేకపోతున్నాను—ఈ విశాల ప్రపంచంలో ఎవరిమట్టుకు వాళ్ళే కరెక్టు—

ఏ మనిషి పుర్రెలో ఎప్పుడు ఏ ఆలోచన చోటుచేసుకుంటుందో, ఎవరు తమ పనిని తాము సమర్థించుకోడానికి ఎట్లా ఇంటర్‌ప్రెట్ చేస్తారో అందరికీ తెల్సు

అయితే ఇంతకన్నా అశనిపాతం లాంటివార్త (వ్యక్తిగతంగా మాత్రమే) ఒక ఆహ్వాన పత్రిక మోసుకొచ్చింది—

డా॥ వెంకటయ్యగారి కుమారుడు చి॥ రమేష్ బి ఇ పై చదువులకు అమెరికా వెడుతున్న వీడ్కోలు సందర్భంలో విందు—

నిరుద్యోగిగా సకాలంలో పెళ్ళి చేయబడని రంగనాథంగారి కూతురు రహమాన్‌తో లేచిపోవడం—భారతదేశంలో గడపడం ఇష్టంలేక పై చదువులపేరిట డా॥ వెంకటయ్యగారి కొడుకు అమెరికా వెళ్ళడం-నిర్దిష్ట నిర్వచనంలేని ఈ రెండు సంఘటనలను ఎలా అన్వయించుకోవాలో తెలియక ఇది భారతదేశమా? లేక రోమ్ దేశమా? అని తికమక పడిపోవడం నా వంతయ్యింది □

బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!

స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి

లోధ్ర

75 సంవత్సరములకు పైగా సుఖజీవనమునకు లోధ్ర టానిక్‌ను వాడిన స్త్రీలు ఎందరో!

ఉచిత వైద్య సలహాకు ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు ఈ కూపన్‌ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి

పేరు ______

విలాసము ______

______ PIN ______

కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్ రాయపేట మద్రాసు 14

ఏజంట్లు: శీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ — సికింద్రాబాద్ — బెంగుళూరు